# ఎల్కతుర్తికి వేలాదిగా తరలిరావాలి

- బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్




ఖమ్మం నగరంలోని 6వ వార్డులో వాల్‌రైటింగ్ రాస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, ఏప్రిల్ 14 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన పెద్దఎత్తున జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని, ఖమ్మంజిల్లా నుంచి అధికసంఖ్యలో ప్రజలు తరలిరావాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం నగరంలోని 6వ డివిజన్‌లో రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌రైటింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని కోరారు. సభకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ప్రజలు తరలివస్తారని తెలిపారు. 2000వ సంవత్సరంలో పిడికెడు మందితో స్థాపించిన పార్టీ 25యేండ్లు పూర్తి చేసుకొని వేడుకలు జరుపుకుంటున్నదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఎంతోమంది కుట్రలు, కుతంత్రాలు చేసినా చావునోట్లో తలపెట్టి 2014లో రాష్ట్రం సిద్ధించే వరకు పోరాడిన మహానాయకుడు కేసీఆర్ అని, ఆయన సారథ్యంలో నడుస్తున్న పార్టీలో మనమందరం సభ్యులుగా ఉండటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, రఘునాథపాలెం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వీరూనాయక్, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ మక్బుల్, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## రజతోత్సవానికి కదలిరండి..

సన్నాహక సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పక్కన కమల్‌రాజు, కొండబాల

ఎర్రుపాలెం, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు నూతనోత్సాహంతో కదలిరావాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరగబోయే రజతోత్సవ సభ సన్నాహక సమావేశం బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావులతో కలిసి వద్దిరాజు దిశానిర్దేశం చేశారు. సభ తెలంగాణ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించబోతుందన్నారు. పదేళ్ల పాలనలో అడగని పథకాలు సైతం ఆచరణలో అమలు చేసి చూపించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. వరంగల్ సభకు వాహనాల ఏర్పాటు, సదుపాయాల కల్పనపై కమల్‌రాజు సమీక్షించారు. ఆ రోజు గ్రామగ్రామాన పార్టీ జెండాలు ఆవిష్కరించుకొని వరంగల్ బయల్దేరాలని సూచించారు. అనంతరం సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, నాయకులు యరమల రేణుకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగేశ్వరరావు, మస్తాన్ వలీ, తిరుపతిరావు, కాళేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అందరివాడు

- దేశానికి ఆయన సేవలు చిరస్మరణీయం
- బాబాసాహెబ్ జయంతి వేడుకల్లో కొనియాడిన వక్తలు
- ఘన నివాళులు అర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా సంఘాల నాయకులు
- ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు



ఖమ్మం : అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నామా, సండ్ర, కందాళ, బీఆర్ఎస్ నాయకులు



ఎర్రుపాలెం: అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు, కమల్‌రాజు



ఖమ్మం : అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ఇల్లెందులో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న హరిప్రియ, దిండిగాల, బీఆర్ఎస్ నాయకులు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందరివాడని, దేశ ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యం అందించిన మహనీయుడని, ఆయన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. సోమవారం ఆయన 134వ జయంతి వేడుకలను ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పలు సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎర్రుపాలెం మండలంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఖమ్మం జడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం(తెలంగాణ భవన్)లో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వర రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేండ్ల పాలనలో అంబేద్కర్‌పై చూపిన గౌరవం ప్రత్యేకమైనదన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అదనపు కలెక్టర్ విద్యాచందన, భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీవో రాహుల్, కారేపల్లి, ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యేలు బానోత్ మదన్‌లాల్, బానోత్ హరిప్రియానాయక్ తదితరులు అంబేద్కర్‌కు ఘనంగా నివాళి అర్పించారు. –నమస్తే నెట్‌వర్క్



భద్రాద్రి కొత్తగూడెం : అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ



కల్లూరు మండలం పుల్లయ్యబంజర ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

ఉరుములు.. మెరుపులు.. ఈదురుగాలులు.. వడగళ్లతో కూడిన వర్షాలు అన్నదాతలను కోలుకోకుండా చేస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో వారంరోజులుగా అక్కడక్కడా కురుస్తున్న వర్షాలతో చేతికొచ్చిన పంటలు నీటిపాలవుతున్నాయి. సాగునీరు అందకపోయినా బావులు, మోటర్లు, బోర్ల సాయంతో ఎలాగోలా పండించిన పంటను వరుణుడు పగబట్టినట్లు ఆగమాగం చేస్తుండడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆదివారం రాత్రి పలు మండలాల్లో ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. కోతకొచ్చిన వరి పంటలు తలలు వాల్చాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయ్యింది. కొందరు రైతులు పంటలను కాపాడుకునేందుకు నానా పాట్లు పడ్డారు. పంట నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

– భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ మధిర/ దుమ్ముగూడెం/ పెనుబల్లి/అన్నపురెడ్డిపల్లి/ దమ్మపేట, ఏప్రిల్ 14



కల్లూరులో ఈదురుగాలులకు నేలకొరిగిన వరిపైరు

# ముంచిన వాన..

- అకాల వర్షంతో రైతన్న అతలాకుతలం
- కల్లూరు కేంద్రంలో కొట్టుకుపోయిన ధాన్యం
- దుమ్ముగూడెంలో నేలవాలిన వరి పంట
- మధిరలో విరిగిపడిన మొక్కజొన్న చేలు, తడిసిన మిర్చి
- తడిసిన పంటలను ప్రభుత్వం కొనాలని కోరుతున్న రైతులు



దుమ్ముగూడెం మండలంలో పంటను చూపుతున్న రైతులు



కల్లూరులో తడిసిన ధాన్యం ఆరబెడుతున్న మహిళలు

మధిర, బోనకల్లు మండలాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మిర్చి, మొక్కజొన్న పంటలు తడిసిపోయాయి. మధిర మండలంలో అక్కడక్కడా మొక్కజొన్న పైరు నేలవాలింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటపై టార్పాలిన్లు కప్పినప్పటికీ గాలికి లేచిపోయి తడిసిపోయినట్లు రైతులు తెలిపారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సీపీఎం నాయకులు రైతులను ఆదుకోవాలని కోరారు. దుమ్ముగూడెం మండలం రామారావుపేటలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈదురుగాలులకు వరికంకులు రాలిపోయి తీవ్రనష్టం జరిగిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



కల్లూరులో కొట్టుకుపోయిన ధాన్యం

కల్లూరు మండలం పుల్లయ్యబంజర, కిష్టారం, లోకారం, హనుమత్ తండా, కల్లూరుకు చెందిన రైతులు రెండురోజుల క్రితం పుల్లయ్యబంజర ఐకేపీ కేంద్రం(శివాలయం ప్రాంతం)లో ధాన్యాన్ని ఆరబోశారు. మరోపక్క కోసిన ధాన్యాన్ని పొలాల్లోనే ఆరబోశారు. అయితే ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షంతో పొలాల్లో ఆరబోసిన ధాన్యం నీటిలో తడిసి ముద్దయ్యింది. ఈ ధాన్యాన్ని ట్రాక్టర్లతో మరో ప్రాంతానికి తరలిస్తున్నారు. అలాగే ఐకేపీ కేంద్రం ప్రాంతంలో ఆరబెట్టిన ధాన్యం వరద నీటికి సమీప పొలాలు, కాల్వల్లోకి కొంతమేర కొట్టుకుపోయింది. చుంచుపల్లి, సుజాతనగర్, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ, దమ్మపేట, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వారావుపేట మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన వరి, మొక్కజొన్న చేలన్నీ నేలవాలాయి. కొందరు రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షార్పణం అయ్యింది.



దమ్మపేటలో పట్టాలపై నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు



మధిరలో గాలి దుమారానికి పడిపోయిన మొక్కజొన్న

### భద్రాద్రి జిల్లాలో 33 శాతం వరి పంటకు నష్టం

భద్రాద్రి జిల్లాలో రైతులు పండించిన వరి పంటకు 33 శాతం వరకు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. పంట నేలకొరిగినా పూర్తిస్థాయిలో నష్టం ఉండదని అధికారులు చెబుతున్నా.. పడిపోయిన వరి పనలు చేతికి రావని, నీటిలోనే ఉంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరితోపాటు మొక్కజొన్న పంటలు కూడా నేలవాలినట్లు అధికారులు చెబుతున్నారు.



అన్నపురెడ్డిపల్లిలో నేల రాలిపోయిన మామిడికాయలు

### కౌలు రైతులను ఆదుకోవాలి..



నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరి వేశాను. ధాన్యాన్ని ఆరబోసేందుకు సరైన ప్రదేశం లేకపోవడంతో పొలాల్లోనే ఆరబెట్టాను. అకాల వర్షంతో పొలంలోనే నీరు ఉండడంతో ధాన్యంలోకి నీరు చేరింది. వర్షంతో పూర్తి నష్టం వాటిల్లింది. అధికారులు అంచనా వేసి కౌలు రైతులను ఆదుకోవాలి.

– తడికమల్ల వెంకటి, కౌలు రైతు, పుల్లయ్యబంజర

### రైతుకు ఎప్పుడూ తిప్పలే..



ఆరెకరాలు కౌలుకు తీసుకుని వరి పంట పండించాను. పంటను అమ్ముకునేందుకు కేంద్రాల్లో ఆరబోసి అమ్మాలి. దీనికి తోడు మళ్లీ వర్షం రావడంతో వడ్లన్నీ తడిశాయి. మళ్లీ కూలీలచే వేరే ప్రాంతానికి తరలించాలి. ఎటు తిరిగి రైతుకు తిప్పలే. కౌలు తప్పదు.. ఖర్చు తప్పదు. కౌలు రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలి.

– దొంగల కృష్ణయ్య, కౌలు రైతు, పుల్లయ్యబంజర

### కోతకు సిద్ధంగా ఉన్న పంట నేలపాలు..



కోతకు సిద్ధంగా ఉన్న వరి గాలిదుమారంతో మొత్తం నేలపాలైంది. ఎకరానికి మూడు క్వింటాళ్ల వరకు నష్టం వాటిల్లింది. రాలిపోయిన వడ్లు రంగు మారే అవకాశం ఉంది. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తే మాకు నష్టం రాకుండా ఉంటుంది. ఎన్ని చెప్పినా కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లగానే వెనక్కి పంపుతారు.

– కట్టా రామకృష్ణ, రైతు, పెనగడప, చుంచుపల్లి

### నేలవాలిన మూడెకరాల వరి



మూడెకరాల్లో వేసిన వరి పంట మొత్తం నేలవాలింది. ఎండ వస్తే తప్ప వరి పనలు పైకి రావు. కంకులన్నీ కిందనే పడిపోయాయి. వడ్లన్నీ భూమిమీదే ఉన్నాయి. ఎకరానికి మూడు క్వింటాళ్లు నష్టం వచ్చే అవకాశం ఉంది. తిండి గింజలు లేకపోతే ఏడాదంతా గడవడం చాలా కష్టంగా ఉంటుంది. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– పావురాల రాజేశ్, రైతు, పెనగడప, చుంచుపల్లి

### తెల్లారే సరికి నీటిపాలు..



రెండురోజుల క్రితం ధాన్యం కోసి ఆరబెట్టాం. కొనుగోలు కేంద్రాల్లో వేద్దామని.. తేమ శాతం రాలేదని రోజువారీగా తిరగేసి ఆరబోస్తున్నాం. రాత్రివేళ వర్షం ఒక్కసారిగా కురవడంతో పొద్దున్నే వచ్చే సరికి ధాన్యం నీటిపాలైంది. మూడు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. అసలే ఆర్థిక ఇబ్బందులు ఉంటే.. అకాల వర్షం కోలుకోకుండా చేసింది.

– బజ్జూరి గోపాలకృష్ణ, కౌలు రైతు, కల్లూరు

## ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

- మూడు రోజులుగా కొనుగోళ్లు చేపట్టడం లేదని ఆరోపణ
- వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్



గోకినేపల్లిలో ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

ముదిగొండ, ఏప్రిల్ 14 : కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యం మూడు రోజులుగా కొనుగోలు చేయకపోవడంతో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తడిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతులు ధర్నాకు దిగారు. ఈ ఘటన ముదిగొండ మండలం గోకినేపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గోకినేపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి రైతులు మూడు రోజుల క్రితం ధాన్యం తరలించారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిచిపోయింది. దీంతో ఆవేదన చెందిన రైతులు ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై తడిచిన ధాన్యంతో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తమ ధాన్యం కాంటా వేయాలని అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. సెలవుల పేరుతో ఇప్పటివరకు కాంటాలు పెట్టలేదన్నారు. ఎప్పటికప్పుడు కాంటాలు వేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని, ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

## గిరిజనుల చరిత్రను చాటిచెప్పాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



మ్యూజియంను పరిశీలిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, ఏప్రిల్ 14 : గిరిజన మ్యూజియంను సందర్శించే పర్యాటకులు, సందర్శకులకు గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను చాటిచెప్పాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. భద్రాచలంలోని ట్రైబల్ మ్యూజియంను సోమవారం సందర్శించిన పీవో.. బయట నిర్మించే మట్టి గృహాలు, లోపల గోడలపై గిరిజన కల్చర్ పెయింటింగ్ చిత్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన మ్యూజియంను సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారని, అన్ని కళాఖండాలు వారికి చూపించి గిరిజన చరిత్ర ప్రతి ఒక్కరికీ తెలిసేలా చేయాలన్నారు. పర్యాటకులకు తాజా వంటకాలు అందించి వారి మెప్పు పొందాలన్నారు. పీవో వెంట ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీఈ హరీశ్, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, ఐటీడీఏ అధికారులు ఉన్నారు.